క్లుప్తంగా

వైభవంగా గంధోత్సవం



శ్రీ హజరత్ ఖాదర్‌వలి దర్గం

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలో వెలసిన శ్రీ హజరత్ ఖాదర్‌వలి దర్గంలో ఉరుసు సందర్భంగా బుధవారం రాత్రి గంధం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను దర్గా వద్ద నుంచి కడప- బద్వేల్ ప్రధాన రహదారి మీదుగా హజరత్ మాబు శుభాని దర్గా వద్దకు తీసుకెళ్లి పతేహా నిర్వహించారు. అలాగే తిరిగి హజరత్ ఖాదర్‌వలి దర్గా వద్ద జెండాను ప్రతిష్టించారు.

14న దత్తాత్రేయ స్వామి ఉత్సవాలు

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని సాయినగర్‌లో వెలసిన శ్రీ సద్గురు దర్గాస్వామి, శ్రీ దర్గా మాతాజీ ఆలయంలో శనివారం శ్రీ దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

రాయచోటి టౌన్ : రైతులు డ్రిప్ పైపుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి బుధవారం వనిత భాయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయంలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రైతులు పండ్ల తోటలు ఎక్కువగా సాగు చేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పండ్లతోటలతో పాటు కూరగాయలను సాగు చేసే రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే డ్రిప్ పథకాన్ని పొంది ఉండి 7 సంవత్సరాలు పూర్తియిన వారు కూడా అర్హులేనన్నారు. అలాగే తుంపర సేద్యం (స్పింక్లర్లు) కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చుని చెప్పారు.

కలెక్టర్‌కు వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాయచోటి అర్బన్: పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ చెల్లించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ కోరారు. 2023 ఏప్రిల్‌లో జరిగిన టెన్త్ జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన టీఏ, డీఏలతో పాటు రెమ్యూనరేషన్ ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం వారు కలెక్టర్‌కు వినతి ప్రత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజారమేష్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యం

పుల్లంపేట: గ్రామీణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధి లక్ష్యమని ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురు, శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కావున సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరై సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలన్నారు.
లక్కిరెడ్డిపల్లి: ఎంపీడీఓ సభా భవనంలో లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్‌పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీనియర్ అసిస్టెంట్ రహీం సాహెబ్ తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్‌లు హాజరు కావాలని వారు కోరారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు: దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారిని ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని నాగిరెడ్డిపల్లి మేజర్ 3 గామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తెలిపారు. బుధవారం నాగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో మండల సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర దేవి ఆధ్వర్యంలో ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు ఆటలు పోటీలు, చిత్రలేఖనం, నృత్య పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు, తల్లిదండ్రులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు అనుదీప్, ఎస్టీఖాన్ చారిటబుల్ ట్రస్టు అధినేత ఆసియా కలీం, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లెకు పట్టణ హోదా ఎప్పుడో?

- ఇప్పటికీ అర్బన్‌గా కేంద్రంగా గుర్తింపు
- రైల్వే, ఆల్విన్ తదితర పరిశ్రమలకు కేంద్రం



నందలూరు రైల్వే స్టేషన్

రాజంపేట: రాజంపేట నియోజకవర్గంలో అతిపెద్దమేజర్ పంచాయతీ నాగిరెడ్డిపల్లె. ఇప్పటికి నాగిరెడ్డిపల్లె కేంద్ర సంస్థల దృష్టిలో అర్బన్‌గా గుర్తింపు ఉంది. జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రం నాగిరెడ్డిపల్లె పరిధిలో ఉంది. 582 హెక్టార్లలో విస్తరించి ఉన్న నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయితీ 1979 జనవరి 10న ఏర్పాటు అయింది. అలాగే ఆల్విన్ కర్మాగారం కూడా ఈ మేజర్ పంచాయతీ పరిధిలోనే ఉంది. అలాగే బ్రిటిష్ కాలం నాటి ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మున్సిఫ్ కోర్టు, ఎత్తివేసిన స్టీమ్ ఇంజన్ లోకోషెడ్ నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోకి వస్తాయి. రైల్వే పరంగా వందలాది క్వార్టర్స్, సిబ్బంది, రైల్వే అనుబంధ సంస్థలు ఇక్కడ ఉన్నాయి.

ఇప్పటికి పట్టణ హోదానే..

ఇప్పటికి కేంద్రసంస్థలు అర్బన్ కిందనే నాగిరెడ్డిపల్లెను కనెక్షన్లను ఇస్తోందంటే ఇక నాగిరెడ్డిపల్లెకు పట్టణ హోదా ఉన్నట్లేనని చెపుతున్నారు. నాగిరెడ్డిపల్లె, నందలూరు కంబైన్డ్‌గా ఉన్న మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నందలూరుకు రూరల్‌గా కేంద్రంగా గుర్తించి, నాగిరెడ్డిపల్లెను అర్బన్‌గా పరిగణించారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డిపల్లెను మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటి యోగం కల్పించాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది.

పలు గ్రామాల విలీనంతో..

నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలో 15 వేలకుపైగా జనాభా ఉన్నారు. నగర పంచాయతీ మార్చుకోవాలంటే కనీసం 25 వేల జనాభా ఉంటే సరిపోతుంది. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిసర గ్రామాలను విలీనం చేసుకుంటే నగరపంచాయతీ హోదా వస్తుందని పురపాలక నిపుణులు అంటున్నారు. అంతేగాకుండా బ్రిటిష్ కాలం నుంచి రైల్వే కేంద్రంగా ప్రసిద్ధికెక్కిన నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతం, దాని ప్రాముఖ్యతను తీసుకొని ప్రభుత్వం నగరపంచాయతీగా కూడా మార్చుకొనే వీలుంటుంది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో జిల్లాలో ఎర్రగుంట్ల, మైదుకూరు మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలు హోదా కల్పించారు.

పట్టణ హోదా ఇవ్వాలి



నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ ఎప్పటి నుంచే అర్బన్‌గా గుర్తింపు ఉంది. ఆ స్థాయిలో అభివృద్ధి మాత్రం జరగడంలేదు. కేంద్రప్రభుత్వం దృష్టిలో నాగిరెడ్డిపల్లె అర్బన్‌గా గుర్తించింది. నందలూరు రైల్వేకేంద్రం, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుతో పాటు మేజర్ పంచాయతీ పరిపాలన కార్యాలయం, ఆర్అండ్‌బీ బంగ్లా, ఆలివ్న్ లాంటి పరిశ్రమలు నాగిరెడ్డిపల్లె పరిధిలో ఉన్నాయి. ఇప్పటికైనా పట్టణ హోదా ఇవ్వాలి

–షమీవుల్లాఖాన్, మాజీ ఏజీపీ, అరవపల్లె, నాగిరెడ్డిపల్లె అర్బన్

అభివృద్ధి చేయాలి



నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ అర్బన్ ప్రాంతంగా విస్తరించింది. అభివృద్ధి విషయంలో నాగిరెడ్డిపల్లె వెనుకబడి ఉంది. 30 పడకల ఆసుపత్రి కూడా లేదు. ఆర్అండ్‌బీ బంగ్లా నాగిరెడ్డిపల్లెలో ఉంది. అయితే ఇంతవరకు పునర్నిర్మాణం చేయలేదు. నందలూరు బస్టాండు నాగిరెడ్డిపల్లెలోనే ఉంది. పట్టణ హోదా కల్పించి అభివృద్ధి చేయాలి.

–నాయనపల్లె అనుదీప్, ఎంపీటీసీ, నాగిరెడ్డిపల్లె

కరెంటు పోతే పడిగాపులే!



విద్యుత్ సరఫరా లేక పోవడంతో వేచి ఉన్న వృద్ధులు

రాజంపేట టౌన్: మెయిన్ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే పోస్టాఫీసు ఖాతాదారులు పడిగాపులు కాయాల్సి వస్తుంది. మెయిన్ రోడ్డు మార్గంలో హెడ్‌పోస్టాఫీసు ఉంది. ఖాతాదారులు పోస్టాఫీసులో ఆర్థిక లావాదేవీలు కొనసాగిస్తుంటారు. కాగా మెయిన్‌రోడ్డులో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పోస్టాఫీసులో లావాదేవీలు కొనసాగించేందుకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు.

పనిచేయని జనరేటర్

హెడ్ పోస్టాఫీసులో నిత్యం లక్షలాది రూపాయిల్లో లావాదేవీలు జరుగుతుంటాయి. అందువల్ల ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జనరేటర్ ఏర్పాటు చేశారు. అయితే ఆ జనరేటర్ కొన్ని సంవత్సరాలుగా పని చేయక మూలనపడి ఉంది. జనరేటర్‌కు మరమ్మతులు చేపడితే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఖాతాదారులకు ఇబ్బందులు ఉండవు. అందువల్ల తపాలాశాఖ ఉన్నతాధికారులు స్పందించి జనరేటర్‌కు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

అన్నదానం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని నామాలగుట్టపై వెలసిన శ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి, నూతన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం వద్ద బుధవారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు నాగిరెడ్డి సాయి దుర్షన్ రెడ్డి అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం గాలివీటి సురేంద్ర రెడ్డి అయ్యప్ప స్వామికి అభిషేకం, పడిపూజ అనంతరం అయ్యప్ప స్వాములకు, అయ్యప్ప భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు చెల్లు గంగరాజు, గురుస్వామి సోడి వెంకటేష, యాగంటి సుధీర్‌లు తెలిపారు. అనంతరం అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి పూజాది కార్యక్రమాలు నిర్వహించి అయ్యప్ప మాలాదారణ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భూమిపూజ



విరూపాక్ష చెన్నకేశవ స్వామి ఆలయంలో గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దాతలు

సుండుపల్లె: మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో మాలేపాటి శివయ్య నాయుడు కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో గదుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. సుమారు రూ. 5 లక్షలతో గదుల నిర్మాణం చేస్తున్నట్లు వారు తెలిపారు. గదుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తామని తెలియజేశారు.

పంటలకు బీమా చేయించుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నాగమణి

రామాపురం: రబీ సీజన్లో పంటలను సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంటలకు బీమా చేయించుకోవాలనివ్యవసాయాధికారి నాగమణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠ్రావుపేట, సుద్దమళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్ పంటల బీమా చెల్లించేందుకు డిసెంబర్ 15 వరకు చివరి తేదీగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పంటల బీమా చెల్లింపును బ్యాంకుల ద్వారా లేదా మీ సేవ కేంద్రాల ద్వారా రైతులే చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా పంటల బీమాను చెల్లించి విపత్కర పరిస్థితిలో పంట నష్టపరిహారం పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అనంతయ్యగారిపల్లిలో రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న కుమార్ రెడ్డి

పుల్లంపేట: మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లిలో బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి ప్రసన్న రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి 8, రేషన్ షాపుకు సంబంధించి 1, హౌసింగ్‌కు 14, పెన్షన్ 2, ఎంపీడీఓకు 2 దరఖాస్తులు అందాయని వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కుమార్ రెడ్డి మాట్లాడుతూ మొక్కుబడిగా రెవెన్యూ సమస్యలు నిర్వహించకుండా రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ చిట్టిబాబు, సుశీల్ కుమార్, సిద్దా రాజశేఖర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సన్మానం

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లి గ్రామంలోని శ్రీకృష్ణ గీతా మందిరం ముందు భగవద్గీత ప్రవచకుడు అచోలి ముకుందరెడ్డిని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్ మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. శ్రీకృష్ణ గీతా మందిరంలో ఈనెల 4వ తేదీ నుంచి భగవద్గీతలోని 6వ అధ్యాయనం గురించి ముకుందరెడ్డి ప్రవచనం చేశారు. మందిర నిర్వహకులు రిటైర్డ్ తహసీల్దార్ నాయనపల్లి జయన్న, గెలివి నాగరత్నం శెట్టి, విశ్రాంత భారత పురావస్తుశాఖ ఉద్యోగి రామాంజనేయులు, విశ్రాంత మండల అభివృద్ధి అధికారి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గీతాపారాయణం

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో గీతా పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బుధవారం గీతా జయంతిని పురస్కరించుకొని స్థానిక ఇందిరమ్మ కాలనీలోని శ్రీ కృష్ణమందిరంలో గీతా పారాయణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలను ఉదయం నుంచి సాయంకాలం వరకు గానం చేశారు. గీతాపారాయణం ముగిసిన అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

14న నీటి పారుదల సంఘం ఎన్నికలు

చిన్నమండెం: మండల పరిధిలోని కేశాపురం, చిన్నమండెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయకట్టు నీటిపారుదల వ్యవస్థకు సంబంధించిన టీసీ మెంబర్లు, అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలను ఈ నెల 14 వ తేదీన కేశాపురం గ్రామ పంచాయతీలోని మండల ప్రాథమిక పాఠశాలలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో టీసీ మెంబర్లు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని, ఈ ఎన్నికల్లో చాకిబండ పెద్దచెరువు వినియోగదారుల సంఘంలోని ఆయకట్టు దారులు పాల్గొని ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎంపీడీఓ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే వారు నీటి పన్ను బకాయిలు చెల్లించిన ధ్రువీకరణపత్రం సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా తీసుకుని ఎన్నికల అధికారికి సమర్పించాలన్నారు.

పోస్టాఫీసులకు పోటెత్తుతున్న మహిళలు



పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

గాలివీడు : జిల్లాల్లో ప్రధాన పోస్టాఫీసులన్నీ వేలాదిగా తరలివస్తున్న మహిళలతో కిటకిటలాడుతున్నాయి. 18 ఏళ్ల పైబడిన మహిళలందరికీ వ్యక్తిగత ఖాతాల్లో సీఎం చంద్రబాబు రూ.1,500 జమ చేస్తారన్న విస్తృత ప్రచారంతో మహిళలంతా పోస్టాఫీసులకు పరుగులు పెడుతున్నారు. ఇక్కడ ప్రతిరోజూ మహిళలు ఐపీపీబీ ఖాతాల కోసం ఉదయం 8 గంటల నుంచే క్యూ కడుతుండటంతో పోస్టాఫీసులు జాతరను తలపిస్తున్నాయి. నెల రోజులుగా మహిళలు పోస్టాఫీసులకు వెళ్తున్నప్పటికీ నాలుగు రోజుల నుంచి వీరి సంఖ్య విపరీతంగా పెరిగింది. కొందరు మహిళలు చంటి బిడ్డలను చంకన వేసుకొని వస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

టీడీపీ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలవుతాయంటూ కూటమి నేతలు పదేపదే చెబుతున్నారు. ఇందులో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళల ఖాతాల్లో రూ.1,500 జమ చేస్తారన్న ప్రచారంతో మహిళలు పోస్టాఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోస్టల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు.

అసలు సంగతి ఏమిటంటే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాల్లో జమ అవుతాయి. ఇప్పటికే ఐపీపీబీ ఖాతాలు గల లబ్ధిదారులు కొత్తగా ఖాతాలు తెరవాల్సిన అవసరం లేదు. అయితే, ఐపీపీబీ ఖాతాలు కలిగి ఆధార్ లింక్ అయినంత మాత్రానా డబ్బు జమ కాదు. కచ్చితంగా ఆధార్ సీడింగ్ అయి ఉండాలి. బ్యాంకర్లు ఖాతాలకు ఆధార్ లింక్ చేస్తున్నా.. సీడింగ్ చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా చాలామంది మహిళలు పోస్టల్ శాఖ ఇచ్చే ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు ఎగబడుతున్నారు.

కేంద్రానికి గుణపాఠం తప్పదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

రాయచోటి అర్బన్: కేరళతో పాటు బీజేపేతర రాష్ట్రాల అభివృద్ధికి నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శ్రీనివాసులు హెచ్చరించారు. కేరళతో పాటు బీజేపేతర రాష్ట్రాల ప్రజల హక్కులు రక్షించాలనే నినాదంతో దేశ వ్యాప్తంగా సీఐటీయూ, అఖిలభారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీజేపేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా కేరళలో వామపక్ష ప్రభుత్వానికి ఆటంకాలు కల్పిస్తోందని దుయ్యబట్టారు. మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు బి.వి.రమణ, చెన్నయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, సిద్దయ్య, శ్రీను, నాగరాజు, చల్లా రెడ్డెయ్య, రమణ, వెంకటరమణ పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతోనే ఆరోగ్య రక్షణ



ప్రకృతి వ్యవసాయంలో పండిన ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట: సేంద్రియ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని డాక్టర్ శ్వేత అన్నారు. ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంలో పండిన ఉత్పత్తుల స్టాల్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారుచేసే ఆహార ఉత్పత్తులు విషపూరితమై మనుషుల ఆరోగ్యం పై ప్రభావం చూపుతోందన్నారు. విషతుల్యమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసి భవిష్యత తరాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి



గాలివీడు: హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గాలివీడు : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి తెలిపారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, పీసీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్‌డే సందర్భంగా నవంబర్ 27 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా గాలివీడు బస్టాండ్ సమీపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి, ఏఎన్ఎం నాగరాణి, ఏఆర్‌డబ్ల్యూ చంద్రకళ, అంజనమ్మ, నాగేశ్వరమ్మ కరపత్రాల ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుందో అవగాహన కల్పించారు. అలాగే ఎయిడ్స్ యాక్టు 2017 ఏఆర్‌టీ మందులు, ఏపీఎస్ఏసీఎస్ యాప్ టోల్ ఫ్రీ నంబరు 1097 గురించి తెలియజేశారు. హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి వారి స్థితిగతులను తెలియజేశారు.
సుండుపల్లె: మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మడితాడు హెచ్‌డబ్ల్యూసీలో డాక్టర్ శేఖర్ రెడ్డి బుధవారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిలోపించడం వలన వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా కలుషిత సూదులు ద్వారా, రక్తమార్పిడి వలన, మత్తు మందుల వలన, లైంగిక సపర్కం ద్వారా గర్భ సమయంలో తల్లి నుంచి బిడ్డకు వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం



బహుమతులు అందుకుంటున్న విజేతలు

సిద్దవటం: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఇన్‌చార్జి కమాండెంట్ డి నాగేశ్వరప్ప తెలిపారు. మండలంలోని 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో రెండు రోజులపాటు జరిగిన 17వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ బుధవారం ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమాండెంట్ మాట్లాడుతూ రెండురోజులుగా వార్షిక క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. రెండవరోజు పరుగు పందెం పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలు డీ ఈ కంపెనీల మధ్య రసవత్తరంగా జరుగగా.. డీ కంపెనీ విజేతగా నిలిచిందన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఇన్‌చార్జి కమాండెంట్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కె వెంకటరెడ్డి, ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం



ఎన్‌జీఓ సభ్యత్వం నమోదు చేసుకున్న ఉద్యోగులు

సంబేపల్లె: ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని రాయచోటి తాలుకా ఎన్‌జీఓ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సెక్రెటరీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దుద్యాల, శెట్టిపల్లె, రౌతుకుంట, సంబేపల్లెలోని పరిధిలోని ఉద్యోగుల నుంచి ఎన్‌జీఓ సభ్యత్వాన్ని బుధవారం నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఎన్‌జీఓ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. రాయచోటి పరిధిలోని సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి, వీరబల్లి, సుండుపల్లె మండలాలో సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంత చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ నాయకులు దేవేంద్ర, శివారెడ్డి, మహమ్మద్‌బాషా, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలి



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

ఓబులవారిపల్లె: పశుసంపద పెరిగి, పాడిపరిశ్రమ అభివృద్ధి చెందాలని డీఎల్ డీఏ వైద్యాధికారి శివరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాలిరెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాంరెడ్డి మాట్లాడుతూ పాల దిగుబడి పెరిగే విధంగా పాడి రైతులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఏడాదికి ఒక దూడ ఎలా పొందాలి, పశువుల పెంపకం, పాల దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్స చేశారు. అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. రైల్వే కోడూరు ఏడీ సురేష్ రాజు, వైద్యులు ప్రతాప్, దుర్గా నాగమ్మ, ఏహెచ్ఏ మణికంఠ, హరిత గోపాలమిత్ర సహదేవ పాల్గొన్నారు.

స్పందనకు.. వందనం



గుంతలను పూడ్చిన అధికారులు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో సాక్షి దినపత్రికలో బుధవారం పారిశుద్ధ్యం.. దుర్భరం అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. వెంటనే నారాయరెడ్డి పల్లె సంబేపల్లె, దుద్యాల ఆయా గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో మురుగనీటిని తొలగించి గుంతలను యంత్రాల సహాయంతో చదును చేశారు. దీంతో సాక్షి దినపత్రిక యాజమాన్యానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.